క్లుప్తంగా

'ఉపాధి' పనులు పరిశీలన

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనులను అదనపు డీఆర్డీవో సంధ్యారాణి పరిశీలించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ..వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటించాలని సూచించారు. కూలీలకు పనులు కల్పించాలని, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ఉదయం వేళ పనులు చే యించాలన్నారు.

ఉన్నత విద్య అందని ద్రాక్షే



మాట్లాడుతున్న అనిల్

గన్నేరువరం: విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దేశరాజ్ అనిల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. గన్నేరువరం మండలంగా ఏర్పడి ఆరున్నరేళ్లు కావస్తున్నా జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు అతీగతి లేదని విమర్శించారు. విద్యార్థులు 40 కిలోమీటర్ల దూరంలోని కరీంనగర్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, మండలానికి కేటాయించిన గురుకుల పాఠశాలలను సైతం తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేశారని, మండలంలో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంకు విద్య, వైద్యం భారంగా మారిందని విమర్శించారు. మండలంలో కళాశాలలు ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ముడికె అజయ్‌కుమార్, న్యాత నరేష్, దేశరాజ్ నవీన్, రాపోలు హరీశ్, పెంకల ప్రశాంత్, ముక్కెర అభిలాశ్, మంగారపు శ్రీమాన్‌సాయి, దేశరాజ్ వెంకటేష్, చిట్యూరి కొమురయ్య పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్సై రాజేశ్

చిగురుమామిడి: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని చిగురుమామిడి ఎస్సై సామల రాజేశ్ తెలిపారు. శుక్రవారం రాత్రి చిగురుమామిడిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, మైనర్లు వాహనాలు నడిపితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

గడ్డివాము దగ్ధం

చిగురుమామిడి శివారులో ప్రమాదవశాత్తు ఓ రైతు గడ్డివాము దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఎస్సై రాజేశ్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. వారి సహాయంతో మంటలను ఆర్పివేశారు. మరింత ప్రమాదం జరగకుండా చుట్టుపక్కల రైతులతో కలిసి తగు చర్యలు తీసుకున్నారు. బాధిత రైతుకు భరోసా ఇచ్చారు.

మోర్చాల సమావేశం విజయవంతంచేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రెడ్డి

మానకొండూర్: మండలంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించే మోర్చాల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుదేవరెడ్డి అన్నారు. మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు ఇంటిలో శుక్రవారం సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. మోర్చాల సమావేశానికి ఆరు మండలాల నుంచి భారీగా నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, అజయ్ వర్మ, గుర్రాల వెంకటరెడ్డి, మాడ వెంకటరెడ్డి, భాస్కరాచారి, రాజిరెడ్డి, జాడి బాల్‌రెడ్డి, ప్రదీప్‌యాదవ్, సొన్నాకుల శ్రీనివాస్, ఆంజనేయులు, పటేల్ రమేశ్, అడప రవి, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

గన్నేరువరం: మానకొండూర్‌లో నిర్వహించే నియోజకవర్గ మోర్చాల కార్యవర్గ సమావేశానికి కార్యవర్గ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ మోర్చా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించారు. సమావేశంలో యువ మోర్చా జిల్లా కార్యదర్శి నికేశ్, మండల ఉపాధ్యక్షుడు మల్లయ్య, సత్తయ్య,హరీశ్, రవి, రామచంద్రం , రాజు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం

- పనులు ఎప్పటికి పూర్తయ్యేనో..?
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

హుజూరాబాద్: సామాజిక మరుగుదొడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం పట్టణ వాసులకు శాపంగా మారింది. మున్సిపల్ పరిధిలో బహిరంగ మల,మూత్ర విసర్జన నిరోధించి, ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు పట్టణంలో నిర్మించతలపెట్టిన సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్నా పూర్తిచేయకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై పట్టణ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు పట్టణంలోని ఆర్టీసీ డిపోక్రాస్ ఏరియాలో, బుడగజంగాల కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలు ఆరేళ్లుగా పూర్తికాకపోవడంతో ఎప్పటికి పూర్తి చేస్తారోననే సందేహం నెలకొంది.



ఆర్టీసీ డిపో సమీపంలో ఇప్పల్‌నర్సింగాపూర్ వెళ్లే దారిలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

ప్రచారానికే పరిమితమా?

మున్సిపల్ పరిధిలోని బుడగజంగాల కాలనీ, ఆర్టీసీ డిపో ఏరియాలో నిరుపేద కుటుంబాలు దాదాపుగా యాభైకి పైగానే ఉన్నాయి. వీరి అవసరాల కోసం స్వచ్ఛ భారత్‌లో భాగంగా రూ.10 లక్షల వ్యయంతో రెండు కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణం చేపట్టారు. వీటిని ఆరు నెలల్లోగా పూర్తిచేసి ఉపయోగంలోకి తేవాల్సి ఉంది. అయితే ఆరేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో అసంపూర్తిగానే ఉన్నాయి. ఓవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పట్టణాన్ని బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా తీర్చి దిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించి అందుకు తగిన విధంగా నిధులు మంజూరు చేస్తుండగా అధికారులు మాత్రం కేవలం ప్రచారానికే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సగంలోనే వదిలేశారు

స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా బుడగజంగాల కాలనీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కమ్యూనిటీ టాయిలెట్ నిర్మాణాన్ని సగంలోనే వదిలేశారు. ఒక్కో టాయిలెట్ నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం నిర్ణీత గడువులోగా పూర్తిచేయకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తూ నిరుపయోగంగా మారాయి. ఆర్టీసీ డిపో సమీపంలో నిర్మించిన టాయిలేట్ పనులు పూర్తయినప్పటికీ నీటిసరఫరా, డోర్లు లేక నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



బుడుగజంగాల కాలనీలో చేపట్టిన కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణంలో జాప్యంపై ఇంజినీరింగ్ అధికారుల వివరణ తీసుకుని త్వరగా పనులు పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ డిపో సమీపంలోని కమ్యూనిటీ టాయిలెట్‌ను కూడా త్వరలోనే వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్

సమాచారం

పవర్‌కట్ ప్రాంతాలు



తిమ్మాపూర్: మండలంలోని అల్గునూరు ట్రాన్స్ కో పరిధిలోని సబ్ స్టేషన్లలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. అల్గునూరు పరిధిలోని మహాత్మానగర్, తిమ్మాపూర్, అలుగునూర్ ఎల్ఎండీకాలనీలో ఉదయం 7:45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, 33/12 కేవీ మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీఎల్ఎం ఎగ్జిబిషన్‌కు టీచర్లు



మానకొండూర్: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన టీచర్లు మూడు నెలల కిందట టీఎల్ఎంలో మండల స్థాయిలో విజేతలుగా నిలువగా, కరీంనగర్‌లో ఈనెల 20న నిర్వహించే టీఎల్ఎం జిల్లాస్థాయి ఎగ్జిబిషన్‌లో మానకొండూర్ మండలంలోని నిజాయితీగూడెం టీచర్ కె.రాము, డీ.ప్రసూన వెల్ది, శుభాషిని గొల్లపల్లి, అన్నారం జి.నాగర్, కుతూజ యాస్మిన్ మానకొండూర్ టీచర్లు పాల్గొననున్నారు.

ఓటరు సర్వేపై సమావేశం

మానకొండూర్: నియోజకవర్గ స్థాయి తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మానకొండూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్‌వో ప్రియాంక కర్ణన్ శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. అర్హులను గుర్తించి ఓటరుగా నమోదు చేయడం జరుగుతుందని, బీఎల్‌వోలతో డోర్ టు డోర్ సర్వే చేపట్టామని తెలిపారు. ఆయా పార్టీల లీడర్స్‌కి క్లెయిమ్స్ అండ్, ఒబెక్షన్ రిపోర్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రియాంక

సర్టిఫికెట్ల కోసం ప్రదక్షిణలు

- ఆర్థికసాయానికి అర్హుల తిప్పలు
- కుల, ఆదాయ సర్టిఫికెట్‌ల కోసం తహసీల్ ఆఫీస్‌లో పడిగాపులు

చిగురుమామిడి: తహసీల్దార్ కార్యాలయంలో రూ. లక్ష ఆర్థికసాయం పొందడానికి కావాల్సిన కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాల కోసం అర్హులైన ఆయా గ్రామాల ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. వారం రోజులుగా సర్టిఫికేట్‌ల కోసం రోజుల తరబడి తిరుగుతున్నారు. సీఎం కేసీఆర్ బీసీల్లోని కేవలం 16 కులాలకు మాత్రమే పథకం వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయా వర్గాల వారు సర్టిఫికేట్‌ల కోసం నానాయాతన పడుతున్నారు. రోజుకు వందల కొద్ది దరఖాస్తులు వస్తున్నప్పటికీ ఇద్దరు ఆర్ఐలు ధృవీకరిస్తున్నారు. ఇద్దరు సర్టిఫికేట్‌లను ఆన్‌లైన్ చేస్తున్నారు. అయినా సర్వర్ బీజీగా ఉండటంతో ఏమిచేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నెల 20వ తేదీ తుది గడువు కావడంతో తహసీల్దార్ కార్యాలయం, అలాగే ఆన్‌లైన్ చేసేందుకు మీసేవ, టీ సేవల చుట్టూ లబ్ధిదారులు రోజులుగా ప్రదక్షిణలు చేస్తున్నారు.



చిగురుమామిడి తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్‌ల కోసం గుమిగూడిన జనం

పదిరోజుల క్రితం దరఖాస్తు

ఆదాయ ధృవీకరణ పత్రం కోసం పదిరోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికీ ధ్రువీకరణ పత్రం రాలేదు. సర్టిఫికెట్ రాకపోవడంతో ఇదేంటని అధికారులను అడిగితే మీ దరఖాస్తు మావద్దలేదని అంటున్నారు.

– దరిపెల్లి శ్రీనివాస్, బొమ్మనపల్లి

రోజూ తిరుగుతున్నా

పది రోజులుగా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలకోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ఉదయం వస్తే సాయంత్రం, సాయంత్రం వస్తే ఉదయం రమ్మంటున్నారని వాపోయారు.

–కోనేటి ఆంజనేయులు, చిగురుమామిడి

రెండు రోజుల్లో జారీ

పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు దాదాపు 3,500 దరఖాస్తులు వచ్చాయి. దాదాపుగా అందరికి సర్టిఫికెట్లు జారీ చేశాం. మరో నాలుగు నుంచి ఐదు వందల దరఖాస్తులను కూడా ఒకటి రెండు రోజుల్లో జారీ చేస్తాం.

– జయంత్, తహసీల్దార్, చిగురుమామిడి

వైభవంగా పెద్దమ్మ తల్లి జాతర



పెద్దమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: మండలంలోని కొండపలకల గ్రామంలో పెద్దమ్మ తల్లి జాతర వైభవంగా నిర్వహించారు. గురువారం బోనాలతో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకోగా శుక్రవారం నిర్వహించిన జాతరలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పెద్దమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో కుల దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుచుకోవడం ఆనందంగా ఉందని, పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధి కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ నల్ల వంశీధర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు గట్టు రజిత, ముదిరాజ్ సంఘం ప్రెసిడెంట్ బండి సంపత్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు రూ.లక్ష ఆర్థికసాయం అందించాలి



మాట్లాడుతున్న రమేశ్

ఇల్లందకుంట: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇస్తున్నట్టుగానే రూ.లక్ష ఆర్థికసాయం మున్నూరుకాపులకు కూడా ఇవ్వాలని మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు అప్పాల రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. బీసీ కులవృత్తులకు లక్ష రూపాయలు అందించడం హర్షనీయమని, అన్నివర్గాల అభ్యున్నతికి చేయూతనిచ్చే ఉద్దేశంతో వ్యవసాయం మీద ఆధారపడే మున్నూరుకాపులకు కూడా సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం నాయకులు స్వదేశ్, సదయ్య, రఘుపతి, రాజు, లచ్చయ్య, సమ్మయ్య, రాజేందర్, విజయ్, కౌశిక్, రాజు, సాయిపవన్, ప్రణీత్, అరవింద్, దుర్గాప్రసాద్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్

చిగురుమామిడి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సీఎం కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేశామని మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్ తెలిపారు. కిట్‌లో గర్భిణులు, పుట్టబోయే పిల్లలకు అన్నిరకాల పోషక విలువలున్నవి ఉంటాయని, కిట్లు రెండుసార్లు అందిస్తామని వివరించారు. 13 నుంచి 26 వారాల గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అటాగే రెండో కిట్ 27 నుంచి 34 వారాల వారికి హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రిలో పంపిణీ చేస్తామని వివరించారు. ఈకార్యక్రమంలో హోమియోపతి డాక్టర్ అఫ్షనా, సూపర్‌వైజర్లు పద్మ, హాజీబాబా, రామేశం, భారతి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు లైబ్రరీ ర్యాక్స్ పంపిణీ

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలలో పలు రకాల పుస్తకాలను భద్రపరిచేందుకు వీలుగా ప్రభుత్వం లైబ్రరీ ర్యాక్స్‌ను ఇటీవల ఆయా మండలాలకు పంపిణీ అందజేయగా శుక్రవారం మండలంలోని అన్నారం, దేవంపల్లి, గంగిపల్లి, గట్టుదుద్దెనపల్లి కొండపల్కల, లలితాపూర్, రాజీవ్‌నగర్ కాలనీ, ఊటూరు, వన్నారం, వెల్ది, యాదవనగర్, తెనుగుపల్లి కొండపల్కల, ఎస్సీ కాలనీ పచ్చునూర్, ప్రాథమిక పాఠశాలలకు అందజేశారు. ఒక్కో ర్యాక్ రూ.15 వేల వరకు ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. ర్యాక్స్‌తో పుస్తకాలు పాడవకుండా ఉంటాయని ఓ క్రమపద్ధతిలో ఉండటంతోపాటు లైబ్రరీగా ఉపయోగపడుతుందన్నారు.



కోరపల్లిలో గీత కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న గౌడ సంఘం నాయకులు

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్తులను విస్మరించిందని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గండి రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోరపల్లి లో అంబేడ్కర్ విగ్రహం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో గీత కార్మికులు నిరసన తెలిపారు. బీసీ కులవృత్తుల వారికి రూ. లక్ష ఆర్థికసాయం చేస్తానమని కేవలం 14 కులాలకు అవకాశం ఇచ్చారని, తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ఏ ఒక్క పథకానికి గౌడ కులస్తులు నోచుకోలేదన్నారు. బెల్టుషాపులతో ప్రభుత్వం గౌడ కులస్తులను దెబ్బతీసిందని, గౌడ బంధు ప్రకటించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెపుతారని హెచ్చరించారు. కార్యక్రమలో మాజీ ఎంపీటీసీ తాళ్లపెల్లి శ్రీనివాస్, ఆరెల్లి మొగిలి, లక్ష్మణ్, యాదగిరి, చంద్రమోహన్, రాజమౌళి, మురళి, ప్రశాంత్, తిరుపతి గౌడ్, రవీందర్, రాజ్‌కిరణ్, రాజమల్లు, రాకేశ్, వీరన్న గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదని చర్చ



హుజూరాబాద్: పట్టణంలో ఈ నెల 22న ఆవిష్కరించనున్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంలో ఎమ్మెల్యే ఈట ల రాజేందర్ పేరు విషయంలో మున్సిపల్ అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని కామెంట్స్ చేస్తూ శుక్రవారం సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. శిలాఫలకంలో కౌన్సిలర్ల పేర్ల కింద ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేరు ఏర్పాటు చేయ డం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ పలువురు సోషల్ మీడియాలో మున్సిపల్ అధికారుల తీరును ప్రశ్నించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను వివరణ కోరగా ఇంకా శిలాఫలకం ఏర్పాటు చేయలేదని, ప్రొటోకాల్ ప్రకారంగానే శిలాఫలకంలో పేర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

వీణవంక: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ మండలంలోని చల్లూరు శివారులోని ఇసుక క్వారీ వద్ద గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని లేని యెడల పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిన ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇసుక లారీలను అడ్డుకోవడంతో కొద్దిసేపు ఆందోళన నెలకొంది.